క్లుప్తంగా

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన



ఖాతాదారులు, రైతులకు అవగాహన కల్పిస్తున్న సీఈఓ లక్ష్మీప్రసాద్

చిట్టమూరు: స్థానిక పీఏసీఎస్ కార్యాలయంలో ఆర్థిక అక్షరాస్యతపై గురువారం ఖాతాదారులు, రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీఈఓ లక్ష్మీప్రసాద్ డిజిటల్ లావాదేవీలు, జీరో బ్యాలెన్స్‌తో ఖాతాల ప్రారంభం , మొబైల్ బ్యాంకింగ్ సేవలు, రూపే కార్డుతో ప్రమాద బీమా, చిరు వ్యాపారులకు ఇచ్చే రుణాల గురించి తెలియజేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ త్రీ మ్యాన్ కమిటీ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ



ఎయిడ్స్‌పై ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

వెంకటగిరి రూరల్: ఎయిడ్స్ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని నవజీవన్ ఆర్గనైజేషన్ సీసీ పీయూ ప్రాజెక్ట్ మేనేజర్ కే.బాలాజి అన్నారు. గురువారం పట్టణంలోని జెడ్పీ హైస్కూల్, కాలేజీ మిట్ట ప్రాంతాల్లో విద్యార్థులతో ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఎం శశికళ, ఉపాధ్యాయులు శివ ,శాంతి, ఓఆర్‌బ్ల్యూ మునికుమారి తదితరులు పాల్గొన్నారు.

పేద బ్రాహ్మణులకు ఫల సరుకులు పంపిణీ



పేద బ్రాహ్మణులకు ఫల సరుకులు అందజేస్తున్న శిరోమణి శర్మ తదితరులు

గూడూరు రూరల్: మహాలయ అమావాస్య సందర్భంగా గూడూరులోని బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య కల్యాణ మండపంలో గురువారం పేద బ్రాహ్మణులకు ఫల సరుకులు, పితృదేవతలకు అవసరమైన పూజాసామగ్రిని విశ్రాంత తెలుగు పండితులు బ్రహ్మశ్రీ శిరోమణి శర్మ పంపిణీ చేశారు. 44 మంది పేద బ్రాహ్మణులకు రూ.51వేల విలువైన సరుకులను ఇచ్చినట్టు ఆయన చెప్పారు. కార్యక్రమంలో సమాఖ్య అధ్యక్షుడు ఆనిమెళ్ల శివకుమార్, ఉపాధ్యక్షులు కడివేటి రామ్మూర్తి, కార్యదర్శి చిట్టమూరు శ్రీనివాసరావు, కోశాధికారి లలితమ్మ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఉచ్చూరులో వైద్య పరీక్షలు



ఉచ్చూరులో రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి

దొరవారిసత్రం: ఉచ్చూరు సచివాలయం వద్ద గురువారం స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్‌లో భాగంగా వైద్య శిబిరం నిర్వహించారు. డీవీ సత్రం పీహెచ్‌సీ వైద్యాధికారి చైతన్య బీపీ, మధుమేహం రోగులను పరీక్షించడంతోపాటు పాటు క్యాన్సర్, తల్లీబిడ్డ, పోషణ, వివిధ వయస్కులు ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. సర్పంచ్ పద్మమ్మ, నాయకులు, శ్రీనివాసులు, వైద్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సీలింగ్ భూములపై విచారణ చేయాలి

గూడూరు రూరల్: అన్యాక్రాంతమైన సీలింగ్ భూములపై విచారణ చేయాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పంటా శ్రీనివాసులురెడ్డి డిమాండ్ చేశారు. గూడూరు సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట గురువారం కాంగ్రెస్ నాయకులు ధర్నా చేశారు. ఆయన మాట్లాడుతూ, చిల్లకూరు మండలంలో సుమారు 13వేల ఎకరాల వరకు ఉన్న సీలింగ్ భూములు పూర్తిగా అన్యాక్రాంతమయ్యాయని, జాతీయ రహదారికి ఇరువైపులా సుమారు రూ.200 కోట్ల విలువ చేసే సీలింగ్ భూములను రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఆక్రమించి కోట్ల రూపాయలు గడిస్తున్నారని ఆరోపించారు. సీలింగ్ భూముల వ్యవహారంలో అక్రమార్కులకు అండగా నిలుస్తున్న అధికారులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. 10కి పైగా గుంట పోరంబోకులు మాయమైపోయాయన్నారు.కార్యక్రమంలో గూడూరు నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ రామకృష్ణారావు, సర్వేపల్లి, చిల్లకూరు, గూడూరు ఇన్‌చార్జ్‌లు పూల చంద్రశేఖర్, చిల్లకూరు వేమయ్య, సుబ్బారావు, నాయకులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు 19-09-2025

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ లైవ్	:	142
లేయర్ లైవ్	:	110
బ్రాయిలర్ చికెన్	:	252
బ్రాయిలర్ స్కిన్ లెస్	:	278
లేయర్ చికెన్	:	187

మట్టి బకాసురులు..!

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నాయకులు సహజసిద్ధమైన ప్రకృతి వనరులను కొల్లగొట్టి జేబులు నింపుకునే పనిలో పడిపోయారు. బడా నాయకులు ఇసుక, సిలికా, క్వార్ట్జ్, గ్రావెల్ లాంటివి తరలించి సొమ్ము చేసుకుంటూ ఉంటే..తామేమీ తక్కువ కాదని గ్రామ స్థాయి కూటమి నాయకులు మరో అడుగు ముందుకు వేసి ఏకంగా రైతుల పొలాలలోని మట్టిని తరలించి జేబులు నింపుకుంటున్నారు! ట్రక్కు మట్టిని రూ.1800 విక్రయిస్తుండడం చూస్తే మట్టితో ఎంతగా ఆర్జిస్తున్నారో ఇట్టే బోధపడుతుంది.



మట్టిని తవ్వి ట్రాక్టర్లలో నింపుతున్న జేసీబీ

- రోజూ సుమారు 400 ట్రాక్టర్ల మట్టి తరలింపు
- ట్రక్కు మట్టి రూ.1800
- జేబులు నింపుకుంటున్న కూటమి నాయకులు

చిల్లకూరు: రైతు పొలాలను చదును చేసే నెపంతో కూటమి నాయకులు ఇష్టానుసారంగా మట్టిని తరలిస్తున్నారు. తీర ప్రాంతంలోని బల్లవోలు గ్రామ సమీపాన పొలాలలోని ఒండ్రు మట్టిని, సిలికా భూముల్లో వేరుశనగ సాగు పేరుతో కొంతమంది జోరుగా తరలించి జేబులు నింపుకుంటున్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే రైతులు వేరుశనగ సాగు చేసుకునేందుకు సిలికా ఉన్న పొలాలలోకి అవసరమైన మట్టిని తరలిస్తున్నామని బురిడీ కొట్టిస్తున్నారు. ఈ అక్రమార్కులపై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకున్న నాథుడే లేరని స్థానికులు వాపోతున్నారు. మరోవైపు మట్టి రవాణా ట్రాక్టర్ల రణగొణ ధ్వనులతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అక్రమార్కులంతా స్థానికంగా ఉండే కూటమి నాయకులు కావడంతో ప్రశ్నిస్తే దౌర్జన్యం చేస్తారనే భయంతో మిన్నకుండిపోతున్నారు. పాఠశాలలు ఉన్నప్పటికీ మట్టి తరలించే ట్రాక్టర్లు ప్రధాన రహదారిపై మితిమీరిన వేగంతో వెళ్తుండడంతో విద్యార్థులు హడలిపోతున్నారు. పేదలకు మాత్రం సవాలక్ష నిబంధనలతో మట్టి, గ్రావెల్ అనుమతులకు చుక్కలు చూపించే అధికారులు..మట్టి అక్రమ రవాణాపై స్థానికులు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలొస్తున్నాయి. పైగా ఇక్కడి మట్టిని స్థానిక రైతులకు కాకుండా పక్కన ఉన్న కోట మండలంలోని రైతులకు రవాణా చేసి సొమ్ము చేసుకుంటున్నారు. మట్టి తవ్వకాలపై తహసీల్దార్ శ్రీనివాసులను వివరణ కోరగా.. స్థానికులు సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో ఆయన ఆదేశాల మేరకు గ్రామానికి వెళ్లి విచారణ చేశామన్నారు. విచారణ చేసే సమయంలో తవ్వకాలు చేపడుతున్న వారు తమ భూమిలో ఎత్తుగా ఉన్న మట్టిని తవ్వి పక్కనే తాము సాగు చేసే సిలికా భూమిలోకి తరలిస్తున్నామని చెప్పారని, అలాగే మట్టి తరలించే సిలికా భూమిని కూడా పరిశీలించినట్టు తెలిపారు. ఎక్కడా అక్రమ తవ్వకాలు చేయడం లేదని పేర్కొన్నారు.



మట్టిని తరలించేందుకు సిద్ధంగా ఉన్న ట్రాక్టర్లు

వర్షమొస్తే ఇంతే..!

తనియాలిలో మురుగు కాలువ లేక వీధిలో కుంటను తలపిస్తున్న వర్షపునీరు



–రొచ్చు..రొచ్చు అవుతున్న గ్రామాలు.

దొరవారిసత్రం: మండలంలో నెల రోజుల నుంచి అడపాదడపా కురుస్తున్న వర్షాలకు పలు గ్రామాల్లో వీధులు చిన్నపాటి కుంటలుగా దర్శనమిస్తున్నాయి. మరికొన్ని రొచ్చు రొచ్చుగా మారి ఆ దారుల్లో వెళ్లడానికి అవస్థలు పడాల్సి వస్తోంది. ఇటీవల మోస్తరు వర్షానికే కల్లూరు, వేణుంబాకం, తనియాలి తదితర గ్రామాల్లో, శ్రీధనమల్లి, కట్టువాపల్లి, కారికాడు, మీజూరు గ్రామాల్లోని ఎస్సీ కాలనీ వీధుల్లో ఎక్కడ పడితే అక్కడ వర్షపునీరు నిల్వ ఉండి, వరినాట్లు వేసే పొలాలను తలపిస్తున్నాయి. మరి కొన్ని ప్రాంతాల్లో సీసీ రోడ్లు వేసినా మురుగు కాలువలు నిర్మించకపోవడంతో వర్షపు నీరు రోడ్లపైనే నిలిచిపోయి చిన్నపాటి కుంటలను తలపిస్తున్నాయి. వీటి వల్ల దోమలు విజృంభిస్తున్నాయని గ్రామీణులు గగ్గోలు పెడుతున్నారు.





కల్లూరులో వీధుల దుస్థితి

ఉరుములు మెరుపులతో భారీ వర్షం



పొలాల్లో నిలిచిన వర్షపు నీరు

చిట్టమూరు: మండలంలో గురువారం మధ్యాహ్నం ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం దాదాపు రెండు గంటల పాటు కురిసింది. వర్షం దెబ్బకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. వర్షపునీరు రోడ్ల గుంతల్లోకి చేరడంతో వాహనదారులు అవస్థలు పడ్డారు. రైతులు ఇప్పటికే మెట్ట ప్రాంతాల్లో పొలాలను దుక్కులు దున్ని వరి విత్తనాలు చల్లేందుకు ఉపక్రమిస్తున్నారు. చెరువులకు సప్లయ్ చానళ్ల నుంచి కొంత నీరు చేరుతోంది.

కోట, వాకాడులో..

కోట/వాకాడు: కోట, వాకాడు మండలాల్లో గురువారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. వాతావరణంలో ఒక్కసారిగా వచ్చిన మార్పులతో ఆకాశం మేఘావృతమై ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. దీంతో జనజీవనం అస్తవ్యస్తమైంది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. విద్యానగర్ ప్రకాశంకాలనీలో ఇళ్లలోకి నీరు చేరడంతో అవస్థలు పడ్డారు.



వాకాడు దళితవాడలో జలమయమైన వీధి

మున్సిపల్ కార్మికుల ధర్నా

గూడూరు రూరల్: కూటమి ప్రభుత్వం 12వ పీఆర్‌సీని వెంటనే అమలు చేయాలని, తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గురువారం గూడూరు మున్సిపల్ కార్యాలయం ఎదుట మున్సిపల్ కార్మికులు ధర్నా చేశారు. దీనిని నేతృత్వం వహించిన ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ అనుబంధం) జిల్లా అధ్యక్షులు దారా కోటేశ్వరరావు మాట్లాడుతూ, 11వ పీఆర్‌సీ గడువు ముగిసి రెండేళ్లయినా ఇప్పటి వరకు 12వ పీఆర్‌సీని అమలుకు కమిటినీ వేయలేదని, కూటమి ప్రభుత్వం ఇప్పటికైనా అమలు చేయాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికులకు జీతాలు పెంచాలని, గత జూలైలో తమ సమ్మె కాలానికి జీతం చెల్లిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చినా ఇప్పటికీ చెల్లించలేదని నిరసించారు. అనంతరం పట్టణ కార్యదర్శి బి.మురళి పలు సమస్యలపై మాట్లాడారు. డిమాండ్ల సాధన కోసం 23న విజయవాడలో చేయతలపెట్టిన ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. తమ డిమాండ్లపై మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి వెంకటరమణ, పట్టణ అధ్యక్షులు రమేష్, శాంతివర్ధన్, పద్మమ్మ, నారాయణమ్మ, సీఐటీయూ నాయకులు జోగి శివకుమార్, బీవీ.రమణయ్య, మధు, అడపాల ప్రసాద్, ఎంబేటి చంద్రయ్య, సుబ్బయ్యత తదితరులు పాల్గొన్నారు.



మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు

గర్భవతులు, బాలింతలు జాగ్రత్తలు తీసుకోవాలి

గూడూరు రూరల్: గర్భవతులు, బాలింతలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీఓ మెహబూబి కోరారు. గూడూరు రెండో పట్టణంలోని మాళవ్యానగర్ అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం 8వ రాష్ట్రీయ పోషణ్ మాసం నిర్వహించారు. క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకుంటే ఆరోగ్యవంతులుగా ఉంటారన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ హైమావతి, సిబ్బంది అరుణ తులసి, జ్యోతి, రేణుక, మల్లీశ్వరి, కవిత, లక్ష్మి పాల్గొన్నారు. అలాగే నలజాలమ్మ, చాకలిపాళెంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో సూపర్‌వైజర్ సుజన ఆధ్వర్యంలో ఇదే కార్యక్రమం నిర్వహించారు. అంగన్‌వాడీ సిబ్బంది, బాలింతలు, గర్భవతులు పాల్గొన్నారు.



గూడూరు రూరల్: అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ సుజన

అధినేతను కలసిన నేతలు



పార్టీ అధినేతతో పేర్నాటి తదితరులు

గూడూరు రూరల్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డిని గురువారం తాడేపల్లెలోని నివాసంలో గూడూరు నాయకులతో కలసి పార్టీ రాష్ట్ర కార్యదర్శి పేర్నాటి శ్యామ్ ప్రసాద్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. కూటమి ప్రభుత్వ అరాచకాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఎవరూ అధైర్య పడవద్దని, సమస్యలను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని వారికి అధినేత మార్గదర్శనం చేశారు. అధినేతను కలిసిన వారిలో గూడూరుకు చెందిన తిరుపతి పార్లమెంట్ యూత్ వింగ్ జాయింట్ సెక్రటరీ మూలి కిషోర్‌రెడ్డి, ఇన్నమాల వెంకటాద్రి, దువ్వూరు సాయిరెడ్డి, దువ్వూరు శ్రీనివాసులురెడ్డి, పలగాటి సాయికృష్ణ ఉన్నారు.

అధినేతను కలసిన వేమారెడ్డి, మేరిగ

చిల్లకూరు: వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గురువారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో గూడూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ ఆధ్వర్యంలో చిల్లకూరు వైస్ ఎంపీపీ వేమారెడ్డి కుమారస్వామిరెడ్డి కలివారు. ఇటీవల వేమారెడ్డి కుమారస్వామిరెడ్డి, ఆయన తల్లి శారదమ్మపై కూటమి ప్రభుత్వం అక్రమ కేసులు బనాయించడం విదితమే. ఈ నేపథ్యంలో అధినేతను కలసి గూడూరు నియోజకవర్గంలో కూటమి నాయకులు చేస్తున్న అక్రమాలు, అరెస్టులను తెలియజేశారు. దీనిపై అధినేత స్పందిస్తూ, ధైర్యంగా ఉండండి..పార్టీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారని వేమారెడ్డి తెలిపారు.



చిల్లకూరు: అధినేతను కలిసిన వేమారెడ్డి కుమారస్వామిరెడ్డి ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్



పెళ్లకూరు: పార్టీ అధినేతతో చిందేపల్లి

చిందేపల్లి సైతం..

పెళ్లకూరు: పార్టీ అధినేతను వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డిని గురువారం వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి చిందేపల్లి మధుసూదన్‌రెడ్డి తాడేపల్లిలో మర్యాదపూర్వకంగా కలిశారు. వీరి వెంట మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ఉన్నారు.

హుండీ ఆదాయం లెక్కింపు




హుండీ ఆదాయం లెక్కింపులో దేవదాయశాఖ అధికారులు

చిల్లకూరు: మండల తీర ప్రాంతం తూర్పుకనుపూరులోని మల్లేశ్వరస్వామి ఆలయంలో గురువారం హుండీ ఆదాయాన్ని లెక్కించారు. భక్తులు కానుకల రూపంలో మొత్తం రూ.65,144 సమర్పించారని అధికారులు తెలిపారు. ముత్యాలమ్మను దర్శించుకునే భభక్తులు కూడా స్వామివారిని దర్శించుకునేలా చర్యలు తీసుకుంటామని, అప్పుడు ఆలయానికి మరింత ఆదాయం పెరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో మల్లాంలోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ ఈఓ శశాంక్, ముత్యాలమ్మ ఆలయ ఈఓ. నవీన్‌కుమార్, అర్చకులు శివకుమార్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

కండలేరులో 48.651 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో గురువారం నాటికి 48.651టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ గజేంద్రరెడ్డి తెలిపారు. సోమశిల జలాశయం నుంచి కండలేరుకు 10.100 క్యూసెక్కుల నీరు చేరుతోందని, ఇక్కడి నుంచి సత్యసాయి గంగ కాలువకు 1150, పిన్నేరు కాలువకు 20, లోలెవల్ కాలువకు 40, హైలెవల్ కాలువకు 100, మొదటి బ్రాంచ్ కాలువకు 15 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

ఎంత భక్తిపరుడో..!



ముత్యాలమ్మను దర్శించుకునేందుకు కాలినడకన వచ్చిన శ్రీనివాసన్

చిల్లకూరు: తీర ప్రాంతంలోని ముత్యాలమ్మను సుమారు 200 కిలోమీటర్ల దూరం నడచి వచ్చి తమిళనాడు భక్తుడు దర్శించుకున్నాడు. తమిళనాడు కోయంబేడు సమీపంలోని వంగారమ్‌కు చెందిన అమ్మవారి భక్తుడు ఎం.శ్రీనివాసన్ శనివారం కాలినడకన బయల్దేరి గురువారం ఉదయం ముత్యాలమ్మ ఆలయానికి చేరుకుని దర్శించుకున్నాడు. ఆలయ ఈఓ నవీన్‌కుమార్ అతడిని ఆలయ మర్యాదలతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఇప్పటి వరకు మూడు పర్యాయాలు కాలినడకనే వచ్చి అతడు దర్శించుకున్నాడని, అతడు ఎంత భక్తిపరుడో ఇది నిదర్శనమని ఈఓ అన్నారు.

నోటీస్ బోర్డు

- **అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం**

సూళ్లూరుపేట: పట్టణంలోని వీఎస్ఎస్‌సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎకనామిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టులలో అతిథి అధ్యాపక పోస్టులకు (గెస్ట్ ఫ్యాకల్టీ) దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ఎల్‌బీ శంకరశర్మ తెలిపారు. అభ్యర్థులు తప్పనిసరిగా సంబంధిత సబ్జెక్టుల్లో 55 శాతం మార్కులతో పోస్టు గ్రాడ్యుయేషన్ చేసి ఉండాలని, యూజీసీ నెట్, ఏపీ సెట్, పీహెచ్‌డీ కలిగివున్న అభ్యర్థులకు మాత్రమే ప్రాధాన్యత ఇస్తామన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈనెల 22న దరఖాస్తులను కళాశాల కార్యాలయంలో ఇవ్వాలని, 24న ఇంటర్వ్యూకు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఉదయం 10 గంటలకు హాజరు కావాలని ఆయన కోరారు.

- **22నుంచి శరన్నవరాత్రి మహోత్సవాలు**

రాపూరు: స్థానిక కన్యకా పరమేశ్వరిదేవి ఆలయంలో 22 నుంచి అక్టోబర్ 3వ తేది వరకు శరన్నవరాత్రి మహోత్సవాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రతిరోజూ ఒక్కో అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిస్తారని చివరిరోజున గ్రామోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయని తెలియజేశారు.

- **23న మున్సిపల్ కౌన్సిల్**

సూళ్లూరుపేట: సూళ్లూరుపేట మున్సిపాలిటీ కౌన్సిల్ సాధారణ సమావేశం ఈనెల 23న నిర్వహించనున్నట్టు కమిషనర్ చిన్నయ్య తెలిపారు. 29 అంశాలతో కూడిన అజెండాపై సమావేశంలో చర్చించనున్నట్టు తెలియజేశారు.

సీఐటీయూ ధర్నా

సమ్మె కాలపు ఒప్పందాలు అమలు చేయాలని డిమాండ్



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న కార్మిక సంఘ నాయకులు

నాయుడుపేట టౌన్: మున్సిపల్ కార్మికులకు సమ్మె కాలపు ఒప్పందాలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం మున్సిపల్ కార్యాలయం ఎదుట సీఐటీయూ నాయకులు ధర్నా చేశారు. నాయకులు మాట్లాడుతూ, గతంలో సమ్మె కాల సమయంలో చెప్పిన విధంగా జీతాలు చెల్లించాలని, 12వ పీఆర్‌సీ అమలు చేయాలని నినదించారు. అనంతరం సమస్యలపై కమిషనర్ షేక్ ఫజులుల్లాకు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ముకుంద, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు కాలేషా, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



మాట్లాడుతున్న వైద్యులు సూర్య ధర్మేంద్ర

రాపూరు: పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని వేపినాపి పీహెచ్‌సీ వైద్యాధికారి సూర్యధర్మేంద్ర అన్నారు. 8వ రాష్ట్రీయ పోషణ మాసోత్సవాల్లో భాగంగా గురువారం మండలంలోని గిలకపాడు, కంబాలపల్లెలో తల్లులు, గర్భవతులు, అంగన్‌వాడీ కార్యకర్తలకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సౌజన్య, కార్యకర్తలు, చిన్నారులు పాల్గొన్నారు.

దక్కిలిలో..

దక్కిలి: మండలంలోని నాయుడుపాళెం అంగన్‌వాడీ కేంద్రంలో 8వ రాష్ట్రీయ పోషణ్ మాసోత్సవ కార్యక్రమం నిర్వహించారు. పోషకాహారంపై చిన్నారుల తల్లిదండ్రులు, గర్భవతులు, బాలింతలకు వెంకటగిరి ఐసీడీఎస్ సీడీపీఓ శంషాద్‌బేగం అవగాహన కల్పించారు. పిల్లలకు జంక్ ఫుడ్‌ను అలవాటు చేయరాదని, గర్భవతులు, బాలింతలు కేంద్రాల్లో ఇచ్చే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పౌష్టికాహారం తీసుకుంటే గర్భిణులు ఆరోగ్యవంతమైన శిశువుకు జన్మనిస్తారన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి బిందు ప్రియాంక, సర్పంచ్ వెంకటసుబ్బయ్య, సీహెచ్ఓ సుకుమారి, ఎంఎల్‌హెచ్‌పీ శివకుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



దక్కిలి: పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ


బాలుడి మృతిపై అనుమానాలెన్నో..!

- పోలీసులకు మృతుడి అమ్మమ్మ ఫిర్యాదు
- వాస్తవాల నిగ్గు తేల్చాలని వినతి



ఆస్పత్రి వద్ద రోదిస్తున్న బాలుడి తల్లి తులసి


నాయుడుపేటటౌన్: స్థానిక పిచ్చిరెడ్డితోపు వీధిలో అనుమానాస్పదంగా మృతి చెందిన చిట్టేటి లోకేష్ (7) కేసులో వాస్తవాలు వెలికితీసి నిగ్గుతేల్చాలని బాలుడి అమ్మమ్మ విజయమ్మ గురువారం పోలీసులను కోరింది. వివరాలు.. చలివేంద్రం గ్రామంలో అమ్మమ్మ వద్ద లోకేష్ ఉంటూ అక్కడి ప్రభుత్వ పాఠశాలలో 2వ తరగతి చదువుతున్నాడు. అతడి తల్లిదండ్రులు తులసి, వెంకటకృష్ణ నాయుడుపేటలో ఉంటున్నారు. వెంకటకృష్ణ ట్రాక్టర్ డ్రైవర్‌గా, తులసి ఓ పరిశ్రమలో కార్మికురాలిగా పనిచేస్తోంది. ఈ నేపథ్యంలో రెండ్రోజుల క్రితం తులసి తన కుమారుడిని చలివేంద్రం నుంచి తమ ఇంటికి తీసుకువచ్చింది. బుధవారం సాయంత్రం లోకేష్‌ను ఇంటి వద్ద వదలి 4 గంటలకు మేనకూరులోని పరిశ్రమకు వెళ్లింది. ఆ తర్వాత సాయంత్రం 6 గంటలకు వెంకటకృష్ణ ఇంటికి వచ్చాడు. లోకేష్ నోటి నుంచి నురుగు వస్తూ అపస్మారకస్థితిలో పడి ఉండటం, హాస్పిటల్‌కు తీసుకెళ్లేసరికి అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించడం విదితమే. బాలుడి మృతి సమాచారం తెలుసుకున్న చలివేంద్రం నుంచి కుటుంబ సభ్యులు హాస్పిటల్‌కు చేరుకున్నారు. లోకేష్ తల్లిదండ్రులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మూడేళ్ల క్రితం కూడా తల్లిదండ్రుల నిర్లక్ష్యం కారణంగా వారి పాప కూడా మృతి చెందిందని, ఇప్పుడు లోకేష్ మృతి మరణం పలు అనుమానాలకు తావిస్తోందని, దీనిపై సమగ్ర విచారణ చేయాలని పోలీసులను కోరారు. పోస్టుమార్టం అనంతరం లోకేష్ మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. బాలుడి అమ్మమ్మ ఫిర్యాదు మేరకు ఎస్ఐ ఆదిలక్ష్మి కేసు నమోదు చేశారు. వివిధ కోణాల్లో ఎస్ఐ దర్యాప్తు చేస్తున్నారు.



అంబులెన్సులో తరలిస్తున్న లోకేష్ మృతదేహాన్ని చూసి రోదిస్తున్నత కుటుంబ సభ్యులు, బంధువులు

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోండి

నాయుడుపేట టౌన్: పట్టణ ప్రజలందరూ పారిశుధ్యంపై తమవంతు బాధ్యతగా వ్యవహరించి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజులుల్లా కోరారు. స్వచ్ఛతా హి సేవలో భాగంగా గురువారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో పంచాయతీ సిబ్బందితో పాటు మెప్మా, పొదుపు మహిళలతో కలిసి పారిశుధ్యం కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం సీఎస్ తేజ సెంటర్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. మానవహారం ఏర్పాటు చేసి ప్రతిజ్ఞ చేశారు. సాయంత్రం పట్టణంలోని విన్నమాల సప్లయ్ ఛానల్ (కాలువ)లో పూడిక తీయించారు. దోమల నిర్మూలనకు పిచికారీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ ఊరుకుందమ్మ, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.



పారిశుధ్యంపై అవగాహన ర్యాలీ చేస్తున్న కమిషనర్